# పంట కాలవ

## శ్రీ మా. గోఖలే

పెద్ద పిల్లగాడు శివాయి చుట్టుపక్కల కలియచూస్తూ లంబాడి కొట్టు అరుగుమూలకొచ్చి నిలబడ్డాడు, తెల వారంగానే

లంబాడికొట్టు పూర మొగదిల్లో నడివీదారు పక్కనే వుంది లంబాడి కొట్టు నాలుగడుగుల ఎత్తున, యిరవై బారల పొడుగున, ఆరు బారల అడ్డాన, పన్నెండు నాటుకర్ర స్తంభాలతో పంచ అడ్డం తిరిగి, అరుగు పొడుగున అయిదు వడ్ల కొట్లున్నయ్ వడ్లకొట్లక వెనక ఖాళీస్థలంలో కొట్లగోడకు చిన్న తాటాకుల పంచ దించుకుని, పగేళ పైచిలుకునుండి ఓ లంబాడికుటుంబం వుంటున్నది అంతకుముందర కూడా అక్కడే లంబాడి తండలు వుండిపోయి నందున ఆ వడ్లకొట్ల కట్టడం లంబాడి కొట్టయింది.

లంబాడి కొట్టుకు ఎడంపక్క యాభై బారల దూరంలో గౌడ సావిళ్ళు, గడ్డివాములు, మాగాణి పొలాలూ, కుడిపక్క కొంచెందూరంగా నాగాయి చెరువు, ఒడ్డునే పెద్ద గిలకల భావి, యింకొంచెం పక్కన వడ్డె కొంపలు, వాటిపైన చాకి చెరువు, దాని ఒడ్డున మర్రి, తాడి, చింతచెట్లు, ఒక్కడక్కడ వాముల దొడ్లు, ఆపైన మాగాణి చేలూ వున్నయ్ లంబాడికొట్టు మీద కూచుంటే వూళ్ళోకి వచ్చిపోయేజనం, చెరువుకు, పొలాలకు వచ్చి పోయే ఊరి మనుషుల్ని చూడవచ్చు

చేతికర్రలో చుట్టలు కాల్చుకుంటూ పొలాలకి పోయేవారు, గుడ్డ లుతుక్కోటానికి చెరువుకుపోయేవారు, గిలకల భావికి బిందెలు, కడవలు, కావిళ్ల ఎడాపెడా సాగుతన్నయ్.

పడి శివాయి చల్లగా వడ్లకొట్టు అరుగెక్కి, ఆమూలవున్న స్తంభాన్ని వాటేసుకుని, వడ్లకొట్ల వెనకవేపుగా ఓ చూపు చూశాడు లంబాడి రామయ్య చిన్నకూతురు చిన్న లచ్మి, గోగునారజడ చిక్కుతీస్తూ, పంచకు అటుమూలగా వచ్చి కూచుంది, అద్దాల ఎర్ర పరికిణీ, ఎర్ర రవికతో

'ఓయ్?' అన్నాడు శివాయి, వచ్చగా, ఎర్రగావున్న లచ్మిని చూస్తూ.

శివాయిని తలెత్తి ఓ చూపుచూసి, వెంటనే తల దించుకుని, నార జడ వూడదీయటం మొదలెట్టింది లచ్మి

'యియాల తెల్లారే తగులుకుందే నార నీకూ?' అన్నాడు శివాయి, లచ్మిని నవ్వుతూ చూస్తూ

'ఏం తగులుకుంటే? నీదేమన్నా సెయి కల్పుతావా?' అంది లచ్మి, లంబాడియాసతో

'కలసమంటే కలుపుతా—'అని శివాయి అంటున్నాడో లేదో అద్దాల ఎర్ర రవిక, ఎర్రముసుగు, ఎర్రలంగా, చెవి గంటలు, గవ్వల్తో గలగలమంటూ చిన్న లచ్మి కూచున్న అరుగు దిగువున వచ్చి నుంచుంది, ఆ జడల మనిషి.

ఆ మనిషి చిన్న లచ్మి అక్క పెదలచ్మి 'తెల్ల జామపండల్లే అంత పుటగ్గల మనిషిని ఎక్కడా చూల్లే'దని, చప్పున అనుకున్నాడు శివాయి.

ఆ తెల్ల దంతాల గాజుల్తో గలగల చేతులాడిస్తూ, లంబాడి భాషలో, చిన్న లచ్మిని ఏదో కేక లేస్తున్నది పెద్దలచ్మి

తెల్లారే నార ముంగ లేసుకుని దూరేపోయే వార్ని చూస్తూ, యింటి పని పట్టనట్టు కూచున్న చిన్న లచ్మి వాలకం, పెద్ద లచ్మికి గిట్టనట్టని పించింది శివాయికి.

శివాయి అనుకుంటున్నట్టే, చిన్నలచ్మి జడనారతో చప్పున అరుగు దూకి, వడ్లకొట్ల వెనకవేపుకు లగెత్తింది చప్పుడు కాకుండా లగెత్తిన చిన్న లచ్మికి యింకా పెద్దలచ్మికున్నట్టు ఎర్ర ముసుగు, గలగలమనే లంబాడి నగలు లేవనిపించింది శివాయికి పెద్ద లచ్మికి వయసొచ్చింది గనక యివన్నీ ఉన్నాయ్ అనుకున్నాడు శివాయి.

ఎవరో లాగి తన్నినట్టు చప్పున అరుగుదూకి, అరుగువెంట రెండు స్తంభాల వెనక్కువెళ్ళి, నక్కి చూశాడు శివాయి

లంబాడీకొట్టుక ఆనుకున్న నడి బజారుక అవతలివేపు ప్రహారీగోడ దరవాజామయాన, రాతి విగ్రహమల్లే నుంచున్న ఆరుంబాతికడుగుల మనిషిని చూసి శివాయి ఒక్క గుటక మింగాడు

ఆ మనిషి నూటపాతి కెకరాల ఆసామి పెద్దరామయ్య పైనుంచి కింది దాకా పోత పోసినట్టుగావుండి బుగ్గమీసాల్తో నల్లగా నిగనిగలాడుతూ, నీరు కాయకంటె మెడ చొక్కా, పంచ, ఒక భుజాన పాదాల్దాకా వేళ్ళాడుతున్న పైపంచ, మూరెడ పొగాకుకాడ పాయ చీలుస్తూ, నవుబుగ్గల్తో లంబాడి కొట్టువేపు చూస్తున్న పెదరామయ్యను చూసిన శివాయి, అరుగుచాటున యింకొంచెం కిందికి వొంగాడు

'యింకా నీలకాడే వున్నావు, మీ అమ్మ బువ వొండలేదా ఏంటి?' అనడుగుతున్నాడు పెదరామయ్య గలగల చప్పుడవుతుంటే

చేతిలో మట్టి బుంగతో బజారుమధ్యకొచ్చి నుంచున్న లంబాడి పెద లచ్మి, నవుతూ లంబాడి యాసతో 'యిం కాలేదు' అంటూ ఒక్కసారి వెనక్కు తిరిగి, కావడి ఆడించుకుంటూ వస్తున్న బసవయ్యగారి సూరయ్యను చూసి, గలగల చెరువువేపుగా వెళ్ళింది.

నలభై ఏళ్ళ సూరయ్య నాయన బసవయ్య డెబ్బయ్యేకరాల ఆసామి. సూరయ్యతోబాటు వీర్రాఘవులస్వామి, కుటుంబయ్యని యింకో యిద్దరు కొడుకులున్నారు బసవయ్యక పెద్దరామయ్యకు కుడి ఎడంగా వూళ్ళో పేరుంది బసవయ్యకు సూరయ్యకు వెంకట్రత్నం, కోటేశ్వర్లు, సీతమ్మని, యిద్దరు కొడుకులూ, ఒక కూతు రున్నారు వెంకట్రత్నం చెన్నపట్నంలో ప్లీడరీ చదువుతున్నాడు. కోటేశ్వర్లు తొమ్మిదోక్లాసు రెండుసార్లు తప్పి చదువు మానుకుని పేరుకు తండ్రితో వ్యవసాయం చేస్తున్నట్టు కనుపించినా అప్పుడప్పుడు తెల్ల గుడ్డ లేసుకుని బస్తీకి పోయి సినిమాలు చూసి వస్తూవుంటాడు. సీతమ్మకు పెళ్ళయి కాపురానికి వెళ్ళింది.

'ఏరా సూరయ్యా, కోటిగాడేం కావిడి పట్టడా ఏం? వాళ్ళ తోలు పోయినా కావికాడికి?' అని సూరయ్యను పలకరించాడు పెదరామయ్య

'బాగా అడిగావు మావయ్యా! వాడు వామాటంటే ఎప్పుడో బాగు పడేవోడుగా! యీసారి నీకు కనిపిస్తే తలవాచేట్టు సివాట్లు పెట్టు'అన్నాడు సూరయ్య.

'ఏమంటాడేం? పని చెయ్యనంటాడా? అటు చదువూ ఎక్కక, యిటు పనికీ వొళ్ళు బరువై యిగనేందిరా యీళ్ళు మిణకేది? నీ పెద్దవాడు వెంకట్రత్నాన్ని చూసి బుద్ధి తెచ్చుకోగూడదూ? యింతకీ మీ అయ్య అణ్ణి గారాబం చేశాక్లే! దాంతో వాడు మన చెయి దాటిపోయినాడు బసవయబావ అందరికీ మంచోడు, నిజమే! మన చెడును ఏరేసుకోవాలని తెలుస్తేగా? నరేగాని, బసవయ బావను తీరిగ్గావుంటే ఓసారి యిట రామని చెప్పు' అంటూ చుట్ట

చుట్టుకుంటూ నడిబజారువేపు చూసిన పెదరామయ్యకు వూళ్ళోకి గుర్రబ్బండి రావటం కనుపించింది

'ఎవరా బండిలో? కొంచెం ఆపు బండిని—'అని గద్దించి బండి నాపాడు పెదరామయ్య

బండి ఆగటం, తెల్ల గుడ్డల్లో వెంకటేశ్వర్లు ఎగిరి కిందకి దిగటం ఒకసారే జరిగినై

'నేను—నేను మామయ్యా—వెంకటేశ్వరు ను—'అన్నాడు వెంకటేశ్వరు గతుకుతూ

'ఎవరూ?' అనడిగాడు పెదరామయ్య, వెంకటేశ్వర్లును కిందినించి పైదాకా చూస్తూ

'నేను కిష్టమ్మగారి వెంకటేశ్వర్లును—ఏమైనా పనుందా?' అన్నాడు వెంకటేశ్వర్లు పక్క చూపులు చూస్తూ

'తెలుసులేవోయ్! తెలియకనా! నువు మా కిష్టమ్మగారి వెంకటేశ్వర్లువా కాదా అని అడిగాలే! మనిషి మారినట్టుంటేనూ బండి నాపాన్లే! ఉద్యోగమేమన్నా చేస్తున్నావా ఏం?' అనడిగాడు పెదరామయ్య

'ఇప్పే—యింకా లేదు మావయ్యా'అన్నాడు వెంకటేశ్వర్లు, గుటకమింగుతూ

'గుర్రబ్బండిమీద వస్తుంటేనూ వుద్యోగస్తుడు వయినావనుకున్నాలే!' అన్నాడు పెదరామయ్య

'అందుకే గుంటూరు వెళ్లొస్తున్నా మావయ్యా! ఓ స్నేహితుడు పొగాకు కంపెనీలో వుద్యోగం చూస్తానంటేనూ—'మాట సహం మింగాడు వెంకటేశ్వర్లు.

ఏడ్చావు లేవోయ్! నీకూ నాకూ ఎవర్రా వుద్యోగం యిచ్చేది? నువు చదివింది ఆరో క్లాసా! పొగాకు కంపెనీలో నీకు ఉద్యోగమా! గుర్రబ్బండిలో రావటమా? ఒరెయ్ వెంకటేశ్వర్లూ, మీ అయ్య కిష్టమ్మకు పదెకరాల బంగారం వంటి మాగాణి వుంది! కష్టపడి సాగు చేసుకుంటూ ఎనిమిదిని పది చేసుకున్నాడు! నువు చేస్తున్న దేమిట్రా గాడిద? గుంటూరు సినిమా కెళ్ళి గాడ్రా నువు వొచ్చేది? వురేవ్, నీ కెప్పుడ్రా సిగ్గొచ్చేది? ఫో! నువు ఉద్యోగస్తుడివైనై నీది నువు దీపం వెలిగిస్తే మీ అయ్యతోబాటు నేనూ సంతోషిస్తా! పోయిరా' అని తుపుక్కున ఉమ్మూసి, చుట్ట ముట్టించుకుని, దరవాజాపక్క కొండరాతి అరుగు మీద కూచున్నాడు పెద రామయ్య, కళ్ళు మూసుకుంటూ

లంబాడి కొట్టు అరుగు వెనక నక్కిన శివాయి అట్లాగే వెనక్కిదేకి, లేచి లగెత్తాడు.

## 2

పెదరామయ్యది మగ సంతతిలేని సంసారం పెళ్ళయిన పదిహేనేళ్ళకు పుట్టిన మాణిక్యం గారాబంగా పదిహారేళ్ళకు పెరిగింది పెళ్ళాం రాఘవమ్మ పెదరామయ్యకు చేదోడువాదోడుగా కలిసి మెలిగే మనిషి పెదరామయ్యకు తమ్ముడు రామసుబ్బయ్యంటే ప్రాణం మాణిక్యం పుట్టేదాకా పిల్లలులేని లోటు తీర్చటమేకాక పెదరామయ్య ఎన్నను సహం మోసేవాడు రామసుబ్బయ్య గుంటూరు వెళ్ళి చదువుతూ బి ఏ దాక వచ్చినాకగాని సుబ్బరామయ్యలో వచ్చిన మార్పును గమనించలేదు పెదరామయ్య తన పెళ్ళయినాక సుబ్బరామయ్య భాగం పంచుకుని గుంటూర్లో ప్రెస్సు పెట్టుకున్నందుకు తమ్ముణ్ణి పెద రామయ్య ఏనాడూ తప్పు పట్టలేదు కాని రాజకీయాల్లో తలదూర్చిన సుబ్బ రామయ్య ఆస్తి సర్వనాశనం చేసి, మూడేళ్ళ శిక్షతో జైలుకు పోవటం పెద రామయ్యకు మింగుడు పడలేదు గాంధిగారి రాజకీయాల్ని గురించి గౌరవం వున్న పెదరామయ్య యింకే రాజకీయ పార్టీలనూ నమ్మదలచుకోలేదు తనేగాదు దేశంలో చాలామంది ఆ అభిప్రాయంలోనే వున్నారని పెదరామయ్య గట్టిగా చెప్పగలడు అందుకే సుబ్బరామయ్య కొత్త రాజకీయాల్లో తలదూర్చటం తనకు చాలా లవమానం అనుకున్నాడు పెదరామయ్య

సుబ్బరామయ్య జైలుకు వెళ్ళినాక గుంటూరు వొదిలి తన యింటికి వచ్చి వుండమని పెదరామయ్య లన్నా ప్రెస్సు అద్దె కిచ్చి, పెద్దకొడుకు సత్యాన్ని బి ఏ, రెండోవాడు శివానందాన్ని స్కూలుఫైనలు చదివిస్తూ అక్కడే వుండి పోయింది సుబ్బరామయ్య పెళ్ళాం సుందరమ్మ

కూతుర మాణిక్యం పెళ్ళి చేస్తే బాగుండునని పెళ్ళాం రాఘవమ్మ అప్పుడప్పుడు పెదరామయ్య చెవిన వేస్తూ వచ్చింది మాణిక్యానికి పెళ్ళవుతే తమకు ఎంతదూరం అవుతుందోననే ఆలోచనలు చేసిన పెదరామయ్య, పెళ్ళాం మాటల వినీవిననట్లు వూరుకుంటూ వచ్చాడ

పెదరామయ్య ఇంటి వెనక దొడ్డి ప్రహారీ గోడకు ఓ చిన్న కిటికీ లాంటిది వుంది అందులోంచి చూస్తే ఊరి నడిబజారుకు ఎడమపక్క మొదటి సందులో వున్న అప్పయ్యగారి ఇల్లు వీధి గుమ్మం, అరుగులూ కనుపిస్తయ్.

అప్పటిదాకా ఖాళీగా వున్న అరుగు మీదకు అప్పయ్య కొడుకు నాగభూషణం వచ్చి కూచోడం, ఆ కిటికీ దగ్గిర తచ్చాడుతున్న మాణిక్యం చూసింది

గుంటూర్లో రెండో ఏడు బి యస్ సి చదువుతున్న నాగభూషణం ఆ ఏడు తప్పాడ నాగభూషణం ముందెప్పుడూ ఏ క్లాసులోనూ తప్పనట్టు అప్పయ్యకు బాగా గుర్తు వుంది నాగభూషణం రాజకీయాల్లో వేలు పెట్టాడని వాకబుచేసి గుంటూరు వార్తలు విన్న అప్పయ్య, విషయం విని వూరుకున్నాడు. అయితే వేసంగి సెలవులయినాక కాలేజీకి వెళ్ళిన నాగభూషణం యిరవై రోజులకే తిరిగి వీధిగుమ్మంలో అడుగు పెట్టటం చూసిన అప్పయ్యకు గుండెలో ఏదో చిక్కబట్టినట్టయింది 'కాలేజీలో సమ్మె జరుగుతున్నది; మూసేయటం వల్ల ఇంటి కొచ్చా' అని చెప్పేసిన నాగభూషణాన్ని అదోరకంగా చూశాడు అప్పయ్య

'అదేంటే మాణిక్యం, వద్దాకా దొడ్లోనే వుంటావూ? మీ అయ్య నిన్ను రెండుసార్లడిగాడు నీలు మసులుతుండయ్, ఎళ్ళి నీలు పోసుకుని జడేసుకోరాదూ, పొద్దెక్కుతుండదీ?' అన్నది వుప్పుచేటతో రోటి దగ్గర కొచ్చిన రాఘవమ్మ, ప్రహారీ గోడ దగ్గిర కూతుర్ని చూసి

'గులాబి చెట్టు మొగ్గ లేస్తున్నయ్యేమోనని చూస్తున్నానమ్మా. ఆ వుప్పుచేట యిలా తే, నే దంచి తీసుకువస్తా; మళ్ళీ వంట కాకపోతే అయ్య కేకలేస్తాడు' అని వుప్పుచేట తీసుకుని రోట్లో పోసి దంచుతున్న మాణిక్యం అమ్మ లోపలికి పోవటం చూసి, చల్లగా ప్రహారీ గోడ కిటికీ దగ్గర కొచ్చి తొంగి చూసింది

మాణిక్యాన్ని చూసి నవ్వాడు నాగభూషణం నాగభూషణం నవ్వడం చూసి సిగ్గుతో నవ్వింది మాణిక్యం వో చిన్న చీటీచుట్ట ప్రహారీగోడ దాటివచ్చి మాణిక్యం దగ్గిర పడింది

అప్పుడే సందు మొగదల్లో కొచ్చిన వడ్డె పిల్లకాయ శివాయి అప్పయ్య కొడుకు నాగభూషణం, పెదరామయ్య ప్రహారీగోడమీదుగా ఏందో తెల్లి వుండ విసర్టం, కిటికీ వెనకమూల మాణిక్యం నుంచునుండటం చూసి, యీలెసుకుంటూ లగెత్తుకు పొయ్యాడు

## 3

అప్పుడే పొలం వెళ్ళి, చేలకు నీ రెక్కుతున్నదో లేదో చూసివచ్చి, లంబాడీ కొట్టు లరుగుమీద కూచుంటున్న పెదరామయ్యను, అటుగా పోతున్న బసవయ్య చూసి, తనూ అరుగెక్కి పక్కన కూచున్నాడు

'ఏమయ్యోవ్ బసవయ్య బావా! నీకు బొత్తిగా తీరుబడి వుంటంలేదంటగా? అహ, అందరూ అనుకుంటుంటే అడిగాలే!' అని బసవయ్యను పలకరించాడు పెదరామయ్య

'అవును, నీకు ఎగతాళిగానే వుంటది నన్ను చూస్తే! నా యిబ్బందులు నీకేం తెలుస్తయ్!' అన్నాడు బసవయ్య, పై పంచ తీసి నడుమ్మీదగా మోకాళ్ళకు చుట్టి, ఊతంగా కూచుంటూ.

'అవున్లే! చేతికక్కర కొచ్చిన ముగురు కొడుకులూ మనమలుంటే, ఒంటరిగాణ్ణి నాకు తెలుస్తయ్యంటయ్యా నీ కష్టాలూ? రుసి మరిగిన కోడి ఇల్లెక్కి కూసిందంట! సరేగాని చేలకు నీరు పెట్టటం అయిందా? ఎట్టా వున్నాయ్ నారుమళ్ళు? యింద పొగాక్కాడ, చుట్టుకో' అన్నాడు పెదరామయ్య పొగాక్కాడ బసవయ్య కిస్తూ.

అనవయ్యా, అనూ! నీవేం మా రాజువి! యిదేదో మంచి సరుకల్లే వుందే రామయ్యబావా! అదియ్యా, ఎక్కడ ఎద్దాలో గాని మా మనగాడి సరుకుపడ్డావే! సువ్వా ఇప్పుడె పొలం వెళ్ళి వస్తున్నట్టుందే? నేనూ తూర్పు పొలం వెళ్ళి యిప్పుడే వస్తున్నా. ఏమి, యింకా అన్ని చేలు తడవందే! నీవమర పక్కన పెద్దోడు సూరయ పోస్తున్నాడు. ఆటు పొలానికి యిప్పుడే నయుటోళ్లం అయింది యివాళ్ రేపో నీరు పెడ్తా నంటున్నాడు సూరయ్య. భగవంతుని దయవల్ల యీ ఏడు నారుమళ్ళు బాగానే వున్నెయ్' అన్నాడు బసవయ్య, పెదరామయ్య యిచ్చిన పొగాక్కాడ వాసన చూస్తూ చుట్ట చుట్టుకుంటూ.

నువ్వు అదృష్టవంతుడువి బసవయ బావా! చేతి కక్కర కొచ్చిన రత్నాలంటి కొడుకులకి పెళ్ళిళ్ళే, ఒంటివాళ్ళ భాగాలు పంచుకోకుండా, కలిసివున్నేటిందాకా కట్టుకట్టా పొలాలు పెటకపుట్టే అంటున్న ఎవరు మాటు వేం కోరుకుంటారు?' అన్నాడు పెదరామయ్య, బసవయ్య పెపు చూస్తూ.

ఏ నాటి పుణ్యమో యిప్పటిదాకా అలాగే జరుగుతుంటది మా మాటుకు తక్కువేంటి రామయ్యబావా? నిండు కుండంటి కుటుంబం నీ తమ్ముడు రామసుబ్బయ్య బంగారమంటి మనిషి రామసుబ్బయ్య మొగపిల్లల నీ సొంత పిల్లలు కాదని నువ్వు ఎప్పుడూ అనుకోలేదు. రేపు ఏ భాగాని కొచ్చినా కెళ్ళవుతే ఆప్పుడు నీ దగ్గరగాక యింకెక్కడుంటాడు?' అన్నాడు బసవయ్య.

'మనం అనుకుంటానికి జరగవలసింది జరగటానికీ చాలా తేడావుంటుంది బసవయబావా! రామసుబ్బయ్య మారిపోతాడని నేను కలలో కూడా అనుకోలేదు. మనవేమిటి, మన ఊరేమిటి! నాకుమటుకు నేను మన ఊరిపత్యం, పోకడక మించి ఆలోచించలేను. నీకూ నాకూ తెల్లార్లెస్తే రెత్తిరి పడుకునేదాకా పశువులూ పొలాలో పన్నుంటయ్ గందా; యింక వేరే ఆలోచనలు చేసేందుకు సందెక్కడుంటదీ? రామసుబ్బయ్య రక్తం వేరంటావా బసవయ బావా?' అనడిగాడు పెదరామయ్య.

ఎట్టా అవుతుంది రామయబావా? అయితే పరిస్థితులు మనిషిని మార్చటంలో వింతలేదు. రామసుబ్బయ్య గుంటూర్లో చదువుకున్నాడు. నువ్వూ నేనూ ఎక్కడ చదువుకున్నావూ? లేదు. ఊహ తెలుస్తున్న మనిషి కొత్త చోటికి పోతే ఆ గాలి వాడికి తగిల్తీర్తుంది! గుంటూర్లో చదువుతున్నప్పుడు వాడి సావాసాలు ఎవరెవర్తో ముడేసుకున్నయ్యో నీకూ నాకేం తెలుస్తుంది? అంత దాకా ఎందుకు, మా సూరయ్య పెద్దకొడుకు వెంకట్రత్నం చెన్నపట్నంలో చదువుతున్నాడా? వాడి తమ్ముడు కోటిగాడు తొమ్మిదో క్లాసుదాకా చదివి మానుకొన్నాడా, అయితే వాడి గతేమైందంటా? వెంకట్రత్నం పెద్దచదువు చదువుతున్నాడని వాడికి లోపల సీకుతానే వుంది! ఆడల్లే తెల్లగుడ్డ వేసుకుని తిరుగుతాడు. ఆడల్లే ఎప్పుడూ ఏదో పేపర్లు చదువుతావుంటాడు. నిజంగా ఆడికి చదువుమీద గురుంటె తొమ్మిదో క్లాసు తప్పుతాడంటయ్యా రామయ్య బావా? గుంటూరెళ్లి సినిమాలు చూసొస్తుంటేగాని ఆడికి సమ్మగావుంటంలా. చివరకి అటు చదువుకూ, యిటు యివసాయానికీ పనికిరాకుండా పొయ్యాడు. మన అప్పయ్య కొడుకు నాగభూషణం సంగతేమిటంటా? వాడు పూర్తిగా రాజకీయాల్లో పడిపొయ్యాడు. అందుకె వాడి రెండో ఏడు తప్పాడు. యిట్లాంటి కుర్రకారు మనూళ్ళో సానా మందున్నారని నీకు తెలవదా రామయ్య బావా?' అన్నాడు బసవయ్య.

'ఎందుకు తెలవదు బసవయ్య బావా. అయితే బలాని మనిషి బాగు పడ్డాడా, చెడ్డాడా అనేదే నాకు గీటురాయి—ఎవరూ? మన బాపినీడూ అంకమ్మల్లే వున్నారే? రాండి రాండి ఏంటి సంగతులు?' అంటూ బాపినీడు, అంకమ్మలను కూచోమన్నాడు పెద్దరామయ్య.

బాపినీడు యాభై యకరాల ఆసామి. పెదరామయ్య బసవయ్యలంటే గురున్న మనిషి. అంకమ్మకు యిరవై యకరాల ఆస్తుంది. బాపినీడుతో జంట కలిపి తిరుగుతుంటాడు.

పెదరామయ్య, బసవయ్య, బాపినీడు, అంకమ్మ, అప్పయ్యలకు ఊరి తూర్పు దిక్కున దగ్గిర దగ్గిర ఇళ్ళు ఉండటమే కాకుండా దగ్గిరా దూరం చుట్టరికాలు కూడా ఉన్నయ్. ఊరిజనం యీ అయిదుగుర్నీ తూర్పు మురా నాయుడు అనుకొంటారు. ఊరికి పడమరదిక్కునవున్న పెదకోటయ్య, చిన కోటయ్య, బాపయ్య, భావయ్య, నాగయ్యలకు బాగా భూవసతి, ఎంద వుండి, ఒకరి కొకరికి మధ్య మాటా మంచీ చెంచెం చుట్టరికాలూ ఉంటం వల్ల వీళ్ళని పడమర ముఠా అనుకుంటారు జనం.

పంచాయితీ బోర్డు ప్రెసిడెంటుగా పోయేడు తూర్పు ముఠా మనిషి వుండి, యింకో ఏడు పడమరపక్క వారుంటే పూర్వం అంతగా తగాదాలుండవు. మెంబర్లెప్పుడూ చెరి సమంగా ఉండాలని కూడా మాట ఏర్పరచుకున్నయ్. ఊరి మధ్య వాటాపుచ్చ ఒనం మెంబర్లు కూడ ఎవరిలక అప్పుడప్పుడు మార్పులు జరగటం తేలు అటూ, యిటుగా కూడా మారుతుంటం కద్దు. యీ మధ్యనే ఏ దిక్కు ఆ దిక్కు ఏయిన్నా రాజకీయపార్టీలు వుండనే వుంటున్నయ్. పోయిన ఎలెక్షన్లో పెదరామయ్య మాకా కోర్టుకొచ్చిన ప్రతినిధి నెగటంతో తూర్పు దిక్కు పొందిన అంగా... దిక్కు నుండి దుర్యాస పెట్టటం ఎక్కువైంది.

'ఏం బాపినీడూ, చెంబులెత్తేగా తోచుకలనే కన్నాళ్ళు మరి నీరెప్పుడు పెడ్తా మనుకుంటున్నావేంటి?' అనడిగాడు పెదరామయ్య.

'నాకనా, నీకూ నీం కిచ్చిందేంటి రామయబావా? పక్క పక్కన అన్నీ మనవాళ్ళ పొలాలేగా! పంటకాలవకాడ మనం మనం ఎట్లాగైనా సద్దుకోవచ్చు. ఎటువేరి బసవయ్యన్న పడమరతట్టు ఆ యిరవై యకరాల పొలానికే ఇబ్బంది! ఎందుకంటే, యిన్నాళ్ళూ పక్కన అప్పయ్యన్న పొలం వుంది కాబట్టి యిబ్బందేం లేకపోయింది. మరిప్పుడు కతే మారిందిగా! ఆ యిసయమేందో యీసారి బసవయ్యన్నే చూసుకోవాలి' అన్నాడు బాపినీడు.

'ఏదేంటి బాపినీడూ, కొత్తగా మాట్లాడుతున్నావు? యిన్నాళ్ళూ లేని యిబ్బంది యిప్పుడేం వచ్చిందీ?' అనడిగాడు పెదరామయ్య.

'అప్పయ్యన్న ఆ అయిదెకరాలూ పెదకోటయ్యకి అమ్మాడంట!' అన్నాడు బాపినీడు, విషయం బయటపెడుతూ.

'అబ్బే, అది నీకు తెలవదు బాపినీడూ. ఆ అయిదెకరాలూ అమ్మవల్సి వస్తుంటే అప్పయ్యబావ నాతో అన్నాడు. అదేం పనిలేదు కాదని అప్పయ్య బావతో గెట్టిగా చెప్పా. ఆమాట కొస్తే రామయబావే ఆ పొలం కొనేవుందుముగా! అమ్మదల్చుకుంటే నాకూ రామయబావకు చెప్పకుండా మటుకు ఆ పని చేయవద్దన్నా. యీ సంగతి రామయబావ కూడా తెలుసు. మనకి తెలవకుండా అప్పయ్యన్న అంతపని ఎప్పటికీ చెయ్యడనుకో' అన్నాడు బసవయ్య.

'ఓసి యింతేనా నీకు తెల్సింది బసవయ్యన్నా? అప్పయ్య ఆ అయిదెకరాల పొలాన్నీ పక్కనున్న తన పొలంలో కలుపుకోవాలని పెదకోటయ్య ఎప్పుడో కలలు కంటం అందరికీ తెల్సిన విషయమే. కాని అప్పయ్యన్న పట్టించుకోదు. యిప్పుడు అసలు కతే అడ్డం తిరిగిందిగా! ఏమంటావు అంకమ్మా?' అన్నాడు బాపినీడు, అంకమ్మవేపు తిరిగి కళ్ళెగరేస్తా.

'అవును బసవయబావా. అప్పయబావ పెదకోటయ్యకా అయిదెకరాల బయానా కూడా తీసుకున్నాడు' అన్నాడు అంకమ్మ.

'ఆ! మాతో మాటమాత్రంగానన్నా అన్లేదే అప్పయ్యబావ? పెదకోటయ్య మన అప్పయ్యబావ పొలం కొనటమా?' ఆశ్చర్యంగా అన్నాడు పెదరామయ్య.

'ఈడ మనమంతా ముండమోసి కూకున్నామనే ఆ పెదకోటయ్య అనేది! మాట్లాడవేం బసవయ్యన్నా?' అనడిగాడు బాపినీడు.

'మనం మనం ఒకటనిగదా యిన్నాళ్ళు అందరమనుకునేది? మనకు తెలవకుండా అప్పయ్యబావ ఆ పొలం అమ్మటం పెదకోటయ్య ప్రెసిడెంటుగా గెలిచినంతగా మాసాలు దువ్వుతున్నాడు' అన్నాడు అంకమ్మ

'అసలు విషయం నన్ను చెప్పమంటావా రామయబావా? అప్పయ బావ ఆస్తి కాస్తా పల్చనని మనకందరికీ తెల్సిన విషయమే పెదకోటయ్యకు వందెకరాలపైనుంది పెద్ద కూతురు పెళ్ళయి, యింకా రెండో పిల్లకు కావాలి. మొగపిల్లలు లేరాయె తన కొడుకు నాగభూషణం పెద్ద చదువు చదువుతున్నాడు గనక పెదకోటయ్య రెండోపిల్లని తన కొడుక్కిస్తాడని అప్పయ బావకు బాగా నమ్మకం కలిగింది'అని చెప్పాడు బాపినీడు, విషయాన్ని యింకొంచెం ఎదుటికి లాగుతూ.

'యిది యిషయానికి గండీ కొట్టడంకాక మరేంటంటూ బసవయ బావా?' అని చెప్పాకోల కొట్టినట్టు కాకరిచ్చి ఉమ్మేశాడు పెదరామయ్య

'యింతమాత్రాని కేమవుద్ది రామయబావా! తన యిషయమేదో తను చూసుకున్నాడు, అప్పయ్యబావ కాదంటానికి నువ్వెవరు నేనెవర్ని?' అన్నాడు బసవయ్య, తూర్పు దిక్కుగా చూస్తూ

'అసలు పాయింటు యింకా బసవయ్యన్నకు అర్థం కాలేదనేగా మనం అనుకోవాల్సింది? మొదట బసవయ్యన్న యిరవైయ్యేకరాల పొలానికి యింక నీరెట్టాపెక్కడ్నే విషయం అలావుంచ, మన్లోనించి అప్పయ్యబావ చీలి ఆలోచిస్తాడనె అర్థం రావటం లేదా అనేగా నేనడగటం? ఏమంటా అంకమ్మా?' అనడిగాడు బాపినీడు

అంకమ్మ పెదరామయ్యను చూశాడు పెదరామయ్య బసవయ్యను చూశాడు బసవయ్య తూర్పు దిక్కునుండి మొహం తిప్పకుండా 'మనూరికేదో చీడ పట్టింది!' అనన్నాడు, తబుక్కు ఉమ్మేసి కళ్ళు మూసుకుంటూ.

## 4

ఆ మరనాడు తెల్లవారకమునుపే బసవయ్య మనమడు కోటేశ్వర్ను ముందటిరోజే గుంటూరెళ్ళి తిరిగొచ్చిన కిష్టమ్మగారి వెంకటేశ్వర్లును లేపుకుని తను సందు మొగదల్లో నిలబడి అప్పయ్య కొడుకు నాగభూషణాన్ని పిల్చుకు రమ్మని వెంకటేశ్వర్లును పంపటం, పక్కనే పంచాయతీబోర్డు ఆఫీసు పంచ స్తంభానికి ఆనుకుని వెళ్ళాడుతున్న పడ్డె శివాయి చూశాడు.

యింకొంచెం సేపటికి సైకిలు కట్టూ, కాలరు చొక్కా వేసుకుని నిద్ర మొహంతోవున్న నాగభూషణాన్ని వెంటపెట్టుకుని, కోటేశ్వర్లును కలుసుకున్నాడు వెంకటేశ్వర్లు

'ఒరేయ్, వీడి మొహం చూస్తుంటే తెల్లవార్లు నిదరపోనట్లు లేదంట్రా వెంకటేశ్వర్లూ? పెద్ద కాలవకు పోదామంట్రా నాగభూషణం?' అనడిగాడు కోటేశ్వర్లు

'ముందరగా చెప్పి చావగూడదూ—వుండు, వెళ్ళి తుండుగుడ్డ తెచ్చుకుంటా'—అంటూ వెనక్కి తిరుగుతున్న నాగభూషణాన్ని మధ్యలోనే చెయి పట్టుకుని ఆపి 'యిగసొర్లేరా, నిదర మొహం నీవు! యిప్పటికే తెల్లగా తెల్లారుతున్నది! మాకాడ వున్నాయిలే తుండుగుడ్డలు లోపల డ్రాయరేం తగలేసుకోలేదా? అనంటూ పడమరపక్క పెద్ద కాలవవేపుకు దారితీశాడు కోటేశ్వర్లు గబగబ నడుస్తూ

నాగభూషణానికి వూరిబయట పిల్లకాలవల నీటిగాలి తగిలేసరికి నిద్ర మత్తు వొదిలింది ఊరిబయటనుండి డొంకదారిన ఒకటిన్నర మైలుంది పెద్ద కాలవకు కృష్ణానదినుండి వచ్చే పెద్ద కాలవ, ఆ చుట్టుపక్కల గ్రామాలన్నిటికీ నీటి పంపిణ చేస్తుంది

'నిన్న నేనో బుద్ధి తక్కువ పని చేసి, లెంప లేసుకున్నా' అన్నాడు వెంకటేశ్వర్లు దారి మధ్యలో

'ఏం చేశావేం?' అనడిగాడు కోటేశ్వర్లు.

నిన్న నేను గుంటూరువెళ్ళి తిరిగివస్తూ పెద్ద ఒంతెన్న దగ్గిర బస్సు దిగి, మన ఊరి రాముడి గుర్రబ్బండి ఖాళీగా వస్తుంటేనూ ఎక్కి కూచున్నా. వాళ్ళింటిదగ్గర యముడల్లే పెద రామయ్యమామ బండి వాపి, దిగమన్నాడు! నా పై ప్రాణాలు పైకి లేచినయ్యంటే నమ్మండి! నేను గుర్రబ్బండి ఎక్కానని ఏకధాటిగా పురాణం విప్పి, నా తోలుతీసి వాళ్ళ ప్రహరీగోడమీద ఆరేశాడనుకోండి!' అన్నాడు వెంకటేశ్వరు.

'తస్సదియ్యక్క! మనిషంటే అట్టుండాలి! నాకు మటుకు నాకు రామయ మామను చూస్తే సింహాన్ని చూసినట్టుగా ఉంటుంది! అయితే నిన్నరామయ్య మామకు ఆహారంగా నీ ఖర్మ కాలిందన్నమాట!' అంటూ విరగబడి నవ్వుతున్న కోటేశ్వర్నలో వంత కలిపాడు నాగభూషణం.

నిన్న రాత్రి కలలో పెదరామయ్య మామే నా గుండెలమీద కొచ్చి కూచున్నాడు! యిగ యీ ఏడవ నిద్రపోతే లప్పండి!' అన్నాడు వెంకటేశ్వర్లు, కోటేశ్వర్లు, నాగభూషణంతో కలసి తనూ నవ్వుతూ

'అన్నట్టు నిన్న గుంటూర్లో బస్సుదగ్గిర సుబ్బరామయ్యమామ కొడుకు సత్యం కనిపించి నిన్ను అడగమని చెప్పాడ్రా నాగభూషణం' అన్నాడు వెంకటేశ్వర్లు, పెద రామయ్య తెర తగినాక

'అట్లాగా! సత్యం చాలా చురుకైనవాడు మేమెప్పుడూ గుంటూర్లో కలుసుకుంటూనే ఉంటాం, కాలేజీలు వేరైనా'

'మీ కాలేజీ సమ్మె ఎందుకురా జరుగుతున్నదీ?' అనడిగాడు కోటేశ్వర్లు.

'మా విద్యార్థి యూనియన్‌ను గుర్తించనన్నాడు ప్రిన్సిపాల్ సమ్మె నోటీసిచ్చి అసమ్మతిగా కాలేజీనుంచి వచ్చేశాం సత్యం మా యూనియన్ కార్యదర్శి' అన్నాడు నాగభూషణం.

రామసుబ్బయ్య మామే జైల్లో ఎద్దందుకే రామయ్యమామకు కాకెక్కింది? యిప్పుడు సత్యం కూడా రాజకీయాల్లో చేరాడని తెలుస్తే వాళ్ళ చదువుకు అప్పుడప్పుడు పంపించే పైకం యివ్వకుండా మానుకుంటాడేమో. అన్నాడు కోటేశ్వర్లు.

'రామయ్యమామ అంత నికృష్టుడని నేననుకోను. రామసుబ్బయ్యమామ నిజాయితీ వున్నవాడనీ, సత్యం క్లాసులో ఎప్పుడూ ఫస్టునంటూ చదువంటే గురిగలవాడని రామయమామకు తెలుసు. తన ప్రెస్సుతో సుబ్బరామయ్య మామ మన సంస్కృతి, విజ్ఞానం గురించిన ఎన్నో పుస్తకాలు తెలుగులో అచ్చు వేయించాడు. సుబ్బరామయ్య మామ అందుకే పుట్టాడని నా నమ్మకం!' అన్నాడు నాగభూషణం

'మరి సుబ్బరామయ్యమామ జైల్లో పడ్డది ఎందుకంటావ్?' అనడిగాడు కోటేశ్వర్లు.

యివాళ రాజకీయవాదులు జైలుకు పోవటం విశేషమేం కాదు. చట్టాలను గౌరవించేందుకు మనకు కావలసిన మనుషు లున్నారు!' అన్నాడు నాగభూషణం

'అంతే నంటావా?' అన్నాడు కోటేశ్వర్లు, విషయం తనకు అర్థం కాలేదన్నట్టు.

'అదుగో ఆ నీలు పెట్టేది మీ చేలకి గాదుట్రా నాగభూషణం? అనడిగాడు వెంకటేశ్వర్లు, వాళ్ళు నడిచే డొంక కుడివేపు వేలుపెట్టి చూపిస్తూ.

'అవును, మామే అయ్య నాతో చెప్పనేలేదే యీ పక్క చేలకు నీరు పెడుతున్నట్టూ!' అన్నాడు నాగభూషణం, అటువేపు చూస్తూ.

'ఆ దిగువనేగా మీ పొలం వుంది కోటేశ్వర్లూ?' అనడిగాడు వెంకటేశ్వర్లు.

'అవును. యింకా మా చేలకు నీలుపెట్టటం లేదెందుకనబ్బా? రాండిరా పోయి చూసొద్దాం—' అంటూ డొంక దిగి నాగభూషణం, వెంకటేశ్వర్లతో కలిసి చేలకు అడ్డం పడ్డాడు కోటేశ్వర్లు.

పంట చేలలో కొందరు రైతులు, జీతగాళ్ళు, కూలి మనుషులూ ఎరువు చల్లుతున్నారు, గడ్డి ఏరుస్తున్నారు పంట కాలవలో కత్తులతో మెరక తీస్తున్నారు, నీటిపారుదలకు ఎండాకాలంలో ఎరువుకోసం పశువుల్ని కట్టేసేందుకు వేసిన తాటాకు పాకల యింకా ఒకటి రెండు అక్కడక్కడ వున్నయ్. పొలాలమధ్య మెరకమీద బావుల దగ్గిర, కొత్తగా పల్లాలు తీసిన జలల్దగ్గిర పిల్లకాలవల పక్కనా ఏతాలతోనూ, గూడలతోనూ నారుమళ్ళకు నీరు కడుతున్నారు పచ్చటి నారుమళ్ళు ఏటిగాలికి కెరటాల్లాగా ఆడుతున్నాయ్

నడుంపక్క అప్పయ్య ఐయిదెకరాలూ దిగువ బసవయ్య యిరవై ఎకరాలూ, కుడిపక్క పడమర పెదకోటయ్య ముప్పయి ఎకరాలూ, దిగువ బాపయ్య పదెకరాలకూ మధ్యగా పంటకాలవ పారుతున్నది పంటకాలవకు బసవయ్య చేలదగ్గిర అడ్డి వేసి, అప్పయ్య దగ్గిర కొన్న ఐయిదెకరాలకు నీరు పెడుతున్నాడు, పెదకోటయ్య జీతగాడు ఏసోబు పెదకోటయ్య చేలల్లో, బాపయ్య చేలల్లో ముగ్గురు జీతగాళ్ళు, అయిదుగురు కూలీలు ఎరువులొయ్యటం, గడ్డి ఏరవటం చేస్తున్నారు ఎండనెత్తికి ఎక్కుట, తలపాగ్లు బర్రుగా చుట్టి, చేత పొన్నుకర్రపట్టి, సిరిసిపాయిమనసుకుండా చేసి ఉద్దండంగా, అప్పుడే అక్కడకు వచ్చి గట్టుమీద తాడిచెట్టు క్రింద నుంచున్నాడు పడమర మురా బాపయ్య చుట్ట రగిలిస్తూ బాపయ్య చేలలో ముగ్గురు జీతగాళ్ళు, నలుగురు కూలీలు ఎరువు చల్లటం, గడ్డి ఏరవటం చేస్తున్నారు

పంట కాలవపక్క అప్పయ్య చేను దగ్గరకొచ్చి నిలబడ్డారు కోటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, నాగభూషణం

'ఎవరు నువ్వు?' అడిగాడు నాగభూషణం, అక్కడ చేతికర్ర పుతమీద నుంచున్న జీతగాడు ఏసోబును

'పెదకోటయ్యగారి జీతగాణ్ణి ఏసోబునులే అన్నాడు ఏసోబు.

'మా చేలకు నువు నీరు పెడుతున్నావేం?' అడిగాడు నాగభూషణం

'పెదకోటయ్యగారు పెట్టమంటే పెడుతున్నా, ఏం తప్పా?' అన్నాడు ఏసోబు

'తప్పా, తప్పున్నర! అప్పయ్యగారి పొలంలో పెదకోటయ్యకేం పనుంది?' అని గద్దాయించాడు కోటేశ్వర్లు

'ఇదిగో నువ్వు అప్పయ్య కొడుకు నాగభూషయ్యవి కాదూ?' అడిగాడు వెనకనే గట్టుమీదగా అక్కడకు వచ్చి నుంచున్న బాపయ్య

'నా పేరు నాగభూషణం' అన్నాడు నాగభూషణం, బాపయ్యను ఎగాదిగా చూస్తూ

'అయితే ఏసు, యీ ఐదెకరాలు మీ బాబుకాడ పెదకోటయ్య కొన్నాడని నీకు తెలవకుండా ఉంటుందా అంతేనా?' చుట్ట పొగకు కళ్ళు చికిలిస్తూ అన్నాడు బాపయ్య

'తెలుసు, ఎందుకు తెలవదూ! నువ్వు చెబితే యింకా తెలవకుండా ఉంటుందా?' అనేసి వెనక్కి తిరిగాడు నాగభూషణం, వెటకారంగా చూస్తున్న బాపయ్య చూపు చూసి

'అసెంట్రూ నాగభూషణం? నిజంగా అప్పయ్యమామ యీ పొలం అమ్మాడంటావా?' అడిగాడు కోటేశ్వర్లు, రహస్యంగా

'నాకు తెలియదు అమ్మకపోతే పెదకోటయ్యకు ఎన్ని గుండెలున్నయ్ మా పొలానికి నీరు పెట్టటానికి! ఎవరో పెద వాళ్ళు ఏదయిం చెప్పి చావరుగా!' అన్నాడు నాగభూషణం చిరిగా

అప్పయ్య మామ యీపొలం అమ్మి కొంపముంచాడు! అప్పుకి, మనకీ అసలు పడదు! మా చేలకి నీరు రాకుండా కాలవకు అడ్డివేసి వాళ్ళ చేలకే నీరు పెట్టుకుంటున్నారు' అన్నాడు కోటేశ్వర్లు రహస్యంగా

'పంటకాలవ ఆ బాబుగాడి సొమ్మా ఏంటి? ఏమంటావు?' అన్నాడు వెంకటేశ్వర్లు కోటేశ్వర్లు చెవిలో.

'కాలవకు అడ్డి వేసిందెవరు? యీ కాలవ మీ బాబుగాడి సొమ్మా? మాచేలేం తడవక్కర్లేదా?' పెద్దగా అరిచాడు కోటేశ్వర్లు

కళ్ళు చికిలిస్తున్న బాపయ్యా, చేతికర్ర పూతమీద ఏసోబూ అట్లాగే నుంచున్నారు, నోరు మెదలకుండా, గడకర్రలమాదిరి

'అడ్డి తీసేస్తున్నా, మగసిరుంటే ఎవరడ్డం వస్తారో రాండి!' అని కేకేసి కాలవలోకి దూకాడు కోటేశ్వర్లు

'చూస్తావేందిరా ఏసోబూ?' అనరిచాడు బాపయ్య

కాలవ అడ్డిమీదకు వంగిన కోటేశ్వర్లు నడుం పట్టుకుని ఎత్తి కాలవపక్క చేలోకి విసిరేశాడు ఏసోబు కిందపడ్డ కోటేశ్వర్లు, నేలకు విసిరికొట్టిన రబ్బరు బంతిలాగే ఎగిరి, ఏసోబు చేతికర్ర పీక్కుని గిర్రునతిప్పి ఫెడీమని బాదాడు ఏసోబును దెబ్బకు గొర్రె పోతులల్లే ఎగిర్న ఏసోబు, కర్రతోపాటుగా వెంకటేశ్వర్లును చావమట్టుకింద కాలవలోకి విసిరికొట్టాడో లేదో నాగభూషణం వెంకటేశ్వర్లిద్దరూ కాట్ల కుక్కలల్లే ఏసోబుమీదకు దూకి, గొంతుకొకరూ, నడుం ఒకరూ వాటేసుకుని తపీమని కిందకి తోసి మీద దెక్కి కూచున్నారు

పంటకాలవ దగ్గిర నిప్పు రవ్వలు లేవటం ఓ కంట కనిపెడుతున్న రెండు మూడాల జీతగాళ్ళూ, కూలిజనం పనికర్రలు, గడ్డ పలుగులతో వెంటనే అక్కడకు దూకి, ఎటు వారటు కమ్ముకుంటున్న సమయంలో, పంచ పైకి బిగించి, తలగుడ్డ చుట్టి, చేతికర్రతో పెద్ద కాలవ డొంకమీదుగా చేల కడ్డంపడి పరుగెత్తుకుంటూ వచ్చిన కోటేశ్వర్లు నాయన సూరయ్య, అటువేపు, యిటువేపు కర్రలు, పలుగులు టంటం కొట్టుకోవటం, మధ్యలో మొహం చితికి రక్తం కారుతున్న కొడుకు కోటేశ్వర్లును చూసి పటపట పళ్ళు కొరుకుతూ ఎగిరి గంతేసి రంగం మధ్యకు దూకాడు

బాపయ్య పొన్నుకర్ర అంతరిక్షంలో గిర్రున వెరిసి, టఫీమని సూరయ్య కపాలంమీద పడింది

సూరయ్య వెనకనే పరుగెత్తుకుంటూ వచ్చిన వడ్డె పిల్లకాయ శివాయి పంటకాలవమీద మంటలు లేవటంచూసి, వచ్చినవాడు వచ్చినట్టే గిర్రున వెనక్కు తిరిగి పెద్దకాలవ డొంకమీదుగా వూరి నడిబజారుకుండా అవ్వాయి చువ్వల్లే లంఘించి కొట్టు దగ్గిర కొచ్చిపడి, 'పెదకోటయ్య మురా బసవయగారి సూరయ్యను సంపారు! కోటేశ్వర్లు ఎనిక లిరిగినై! రకతం! రకతం!' అని పొలికేకలు పెట్టాడు

మణికట్టు విరిగి, ఒళ్ళు చిరిగి రక్తం కారుతున్న ఏసోబు మంటల్నుంచి బయటపడ్డ కోడెదూడల్లె ఎగురుతూ పడమరపక్క పీరాస్వామి చెరువుమీదుగా పెదకోటయ్య ఇళ్ళ దగ్గరకొచ్చి, 'బాపయగారి కపాళం పగిలింది! గూడు డిరిగింది! రాండి, రాండి!' అరిచాడు లారగింగ రావునేమ్మ

ఇళ్ళ తలుపులు పగిల్నయ్ కప్పులు లేచినై పెంకులు విరిగినై వీధులు, సందులు దడదడలాడినై. వూరంతా దుమ్ము లేచింది

తూర్పు పెదరామయ్య మురా, పడమర పెదకోటయ్య మురా, కర్రలు, పలుగులు, గొడ్డళ్ళు, కొడవళ్ళు, పనికర్రలు, కావడిబద్దలు అందినవి అందినట్టు పీక్కుని, పెళపెళ పెట్న దిమ్మలు పగిల్నట్టు వొచ్చి పంటకాలవకు యిటుగా పెదరామయ్య మురా, అటుగా పెదకోటయ్య మురా విరగతొక్కుకుంటూ నుంచున్నారు

రక్తంతో గుడ్డలు తడిసిన సూరయ్య, కొడుకు కోటేశ్వర్లు, నాగభూషణం, వెంకటేశ్వర్లు పవి పెదరామయ్య మురాముందు కూచున్నారు, పళ్ళు కొరకుతూ

అటు బాపయ్య, జీతగాళ్ళు ఏసోబు, ఆశ్లేషు, సీతాయి, రక్తంతో ఎర్రపడి పెదకోటయ్య మురా ముందు కూచున్నారు, కారాలు నూరుతూ.

'ఎవర ఒసవయ్యగారి సూరయ్య కోటేశ్వర్లు, అప్పయ్యగారి నాగభూషణం కిష్టయ్యగారి వెంకటేశ్వర్లను రకతం కారేట్టు కొట్టింది?' అని గద్దించాడు పెదరామయ్య.

'ముందర నా కొయ్య కంప కూలగొట్టిండి, యీ జీతగాళ్ళ ఎముకల విరగ్గొట్టిండని వేలుపట్టి ఆనాటి అడగరాదూ?' అనరిచాడు పెదకోటయ్య.

'ఆ మాట తేలాల్చిండి!' అని పెదకోటయ్య మూఠాజనం అరుస్తే 'అరవకుండా పళ్ళు రాలగొట్టండి!' అని కేకలేశారు పెదరామయ్య మూఠా జనం.

'పంటకాలువకు అడ్డేసి ఆర్నెల్లు నీరు పెట్టుకోవాలంట! యీ కాలువ ఆళ్ళ బాబుగాడి సొమ్మా?' అనరిచాడు రక్తంలో తేలిన కోటేశ్వర్లు.

'సర్వనాశనం! మోసం! ఆడి పళ్ళూడగొట్టండి! అబ్బా, కొడుకులా, అళ్ళంతా చేరి నా ఇంటి మీదకొచ్చారు!' అనరిచాడు బాపయ్య.

'వాడి సంగతి ముందరే పూడగొట్టాలి! యింకా ఏంపుంటయ్ పూడగొట్టడానికి? నాయం సుందర్కులా, మనిషి ఒక్కమెత్తే నాక?' అని అంటున్న బసవయ్యకేసి ఒక్కసారి ఓవసికఱ్ఱ వచ్చిపడిందో లేదో, వెంటనే పది పసి కఱ్ఱలు పెదకోటయ్య మూఠామీద పడ్డయ్.

'పొడవండి!' అనరిచారు పెదకోటయ్యమూఠా.

'పలుగు దిగెయ్యండి ఎవరివల్లి!' యింకా పెద్దగా గొంతులు చించారు పెదరామయ్య మూఠా.

అరుపులు! పెడబొబ్బలు! కఱ్ఱలు టకటకమన్నాయ్. పలుగులు పెలపెలమన్నాయ్. గొడ్డళ్ళ దెబ్బలు. కాసేపు పళ్ళలు విరిగినై. కొడవళ్ళు వసికఱ్ఱలు పళ్ళ లెగిరిపడి ఎగిర్నాయ్.

ముందర పెదరామయ్య, పెదకోటయ్యలు నేలమీద విరుచుకుపడ్డారు, రక్తం చిమ్ముతూ.

'పెదరామయ్యబావ పడిపోయినాడు! ఆళ్ళ గుండెల్లో పలుగు దిగెయ్యండి' అనరుస్తూ రెండు చేతులా పైకెత్తిన బసవయ్యను పొన్నుకఱ్ఱతో చినకోటయ్య ఒకే దెబ్బ లాగికొట్టి, ఎగిరి డొక్కల్లో తన్నిన తన్నుకు, గాలివానలో వేళ్ళు పీక్కుని విరుచుకుపడ్డ చెట్టులాగే ఎగిరి పంటకాలవలో విరుచుకుపడ్డాడు బసవయ్య.

'బసవయ్యన్నను చంపాడు చినకోటయ్య! వీడి రక్తం తాగుతా!' అని పొలికేక పెట్టిన బాపినీడు, పలుగు తీసుకుని చినకోటయ్య నెత్తిన కొట్టిన దెబ్బకు, అట్లాగే వెనక్కు వొరిగాడు చినకోటయ్య.

'పదండి! పీకండి! పంగ పగల్చెయ్యండి! ఎముకలు పొడిచేయండి!' అని గొంతులు పగులుతాంటే ఎవరో ఎగిరి నడుంమీద తన్నిన తన్నుకు బాపినీడు పల్టీకొట్టి బసవయ్య పక్కనే పంటకాలవలో కరుచుకున్నాడు.

ఎన్నో పలుగులు, పారలు, గొడ్డళ్ళు, కొడవళ్ళు, కఱ్ఱలు, వసికఱ్ఱలు ఆకాశంలోకి ఎగురుతున్నయ్. భూమి అదురుతున్నది వీరంగంలో. చర్మాలు తూట్లు పడుతున్నయ్. ఎముకలు విరుగుతున్నయ్. అరుపులు, పొలికేకలు, పెడబొబ్బలు, ఏడుపులు, మూలుగులు. పంటచేల నెఱ్ఱెల్లో రక్తం! పంటకాలవ నీరంతా ఎఱ్ఱబడింది.

పూరి మునుసుబు వీరరాఘవస్వామి జోడుగుళ్ళ తుపాకీతో పరుగెత్తుకొచ్చి, అక్కడున్న పైపోగుతోనే బండెక్కి 'మీ అందరిమీద కేసులుపెట్టించి పురి తీయిస్తా! పది నిముషాలుదాటి యిక్కడో మనిషి కనుపించాడంటే తుపాకి గుళ్ళతో కాల్చేస్తా! పోండి యిక్కణ్ణుంచి!' అని కేకేసి, టపటప రెండు గుళ్ళు గాల్లోకి పేల్చాడు.

ఓం. తత్ సత్

సుఖ జీవిత సేవ

"సిద్ధ ఔషధ మహిమ"

సిద్ధుల సాటిలేని మహిమకు ఒక తార్కాణము



కే. టి. కృష్ణమూర్తి ఆచ్చారిగారి

"మేల్ మాయిల్ మందు"

(Regd.)

దీర్ఘకాల చర్మరోగములకు చక్కని నివారిణి

నల్లరంగు, ఎఱ్ఱరంగు పొడలు దద్దులు, ఎట్లు, గజ్జి, (చర్మసంబంధము) పొడలుగల చోట్లలో తిమురు, సూదితో పొడిచినప్పుడు నొప్పి లేకుండుట, నిప్పునకు ... గుర్తెరుగకుండుట, దుర్నీరు సర్వ అవయవములందు వ్యాపించి, రక్తములో కలిసి మత్తు కలుగజేయుట, (నరముల సంబంధము) చేళ్ళవ్రేళ్ళు వంకరుకొనుట, బొబ్బలు లేచుట, ముక్కు బంధనములు, పాదములందు పల్లపుపుండ్లు ఏర్పడుట, కాలు చేతులు వ్రేళ్ళు తెగ్గుట, ముక్కు పొట్టపడుట, చూచుటకు విసుగు పుట్టించు రణములు (అస్థి సంబంధము) వీటికి ఉత్తమ నివారిణి.

1 మండలం (40 రోజులు) నూనె, లేహ్యము రు. 11/— తపాల ఖర్చు రు 2-50

8 ఔన్సుల శ్రీ పరమాత్మ తైలం రు 5/— తపాల ఖర్చు రు. 2/—

పూర్తి వివరములకు వ్రాయండి :

సిద్ధ డాక్టర్ K. T. కృష్ణమూర్తి ఆచ్చారి & సన్స్,

5/22, మేల్‌మాయిల్ P. O. (N A Dt.)

ఎవరు ఎవరో తెలియకుండా ఒకర్నొకరు కుమ్ముకుంటున్న పెద రామయ్య, పెద కోటయ్య ముఠా మనుషులు, మునుసుబు వీర్రాఘవస్వామి తుపాకి పేల్చటంచూసి, ఒక్కసారి రెండు పాయలుగా చీలిపోయి, ఒళ్ళు తూటు పడి రక్తం ముద్దలయిన ఎవరి మనుషుల్ని వారు మోసుకుని, పడమర వారు పడమరకూ, తూర్పువారు తూర్పుకూ అరుచుకుంటూ, ఏడ్చుకుంటూ వూళ్ళోకి వెళ్ళిపోయారు

కొంచెం సేపటికి పూరి సెడిబజారుకుండా నూటయాభై రెండెడ్ల బళ్ళూ, అందిన మినాలు, పాలకీలల్లో, తలలు పగిలి, ఎముకలు విరిగి, ఒళ్ళు తూట్లుపడి రక్తం కారుతున్న రెండు ముఠాల మనుషులు, ముక్కుతూ, మూలు గుతూ గుంటూరు ఆస్పత్రుల వేపుగా తరలి వెళ్ళారు

## 5

కొట్లాటలు జరిగిన కొద్ది రోజులకు వూళ్ళో గుస గుసలు తట్టుకోలేక, అప్పయ్యపెళ్ళాం నాగరత్తమ్మ, అప్పయ్యతో అనేసింది 'ఛీ! ఛీ! వూళ్ళో మొహం ఎత్తుకోలేకుండావున్నా! బుద్ధి బుగ్గయితే కర్మ యిట్టా కాల్తుంది!' లని

'ఏం? కర్మకాలాల్సొచ్చిన అవసరం ఏం వచ్చింది? అసలు సంగతేంటో బయటకు రానీ' అనడిగాడు అప్పయ్య, అప్పుడే చద్దెన్నం తిని, సావట్లో నులక మంచంమీద కూచుని, చుట్ట కాలుస్తూ

'ఆళ్ళంతా కొట్లాడుకుని, తలకాయలు పగలకొట్టుకుంటానికి నువే కారణమంటగా?' అనడిగింది నాగరత్తమ్మ

'ఏ లెక్క ప్రకారం?' అనడిగాడు అప్పయ్య

'ఆ లెక్కలేంటో నాకు తెలవదు! పడమర బసవయగారి పొలంపక్క మన అయిదెకరాల పొలాన్ని ఆ సచ్చినోడు పెదకోటయ్యకు నువమ్మావంటగా?' అనడిగింది నాగరత్తమ్మ

'అయితే ఏమంటా?' అన్నాడు అప్పయ్య

'అంటానికేం ఉంటదీ! యిన్నాల్లా పెదరామయ్యన్న, బసవయల ఎనకనే తిరిగితివిగా! ఆ పెదకోటయ్య ముటా అంటే యీరికి సచ్చినా పడదుగందా! యీరికి తెలవకుండా ఆళ్ళ మొగాలకు పొలం అమ్మకపోతే నువ్వు మాటంటే యీరే కొనేవారుగా? యీ తలకాయలు పగలగొట్టుకోటం ఒరక్కనే పాయె దిగా?' అనడిగింది నాగరత్తమ్మ

'యీరూ, ఆరూ తలకాయలు పగలగొట్టుకున్నారంటే అది ఆళ్ళ పొగురూ, మదంవల్ల! నే నెప్పుడూ ఎవరితోకలు పట్టుక తిరగలేదు నా పొలం నే నమ్ముకుంటానికి రామయబావ సలహా లేంది నమ్ముకోగూడదా? చుట్టాలం, పొరిగింటివారం గనక పెదరామయ్య బావన్నా, బసవయ బావన్నా నాకుండే మర్యాద నా కెప్పుడూ ఉంటద అంతేగాని ఆరికి నాకన్న ఎక్కువ వుందనిమటుకు ఎప్పుడూ కాదనుకో! ఆళ్ళు చెప్పినట్టు నేను యినాలని వాళ్ళనుకుంటే అది నా తప్పు కాదు అప్పటికీ బసవయ బావతో చెప్పిచూశా, తనుగాని, రామయబావగాని పొలం కొంటారేమోనని యిక్కడ ఒసల కిటుకొటి వుంది, నువు తెలుసుకోవల్సింది! నాగభూషణం చదువుక నాకు డబ్బవసరం అని అందరికీ తెల్సిన యిషయమే బసవయబావ పొలానికి ఆనుకునుంది మన అయిదెకరాల పొలం అమ్మటం అంటూ వుంటే, తమ మనిషినని అనుకుంటున్నారు గనక, అయినకాడికి తనక తప్ప పెదకోటయ్యకు పొలం అమ్మనని బసవయ్యను నమ్మకం పక్కపొలాల ధర ఆరువేల చేస్తుంటే తను నాలుగువేలకన్న యియ్యలేనని బసవయబావ అన్నాడు ఎంతన్యాయమో చూశావా? అప్పటికే బసవయబావ దగ్గిర నూటికి పది వడ్డీ లెక్కన రెండువేలు అప్పు చేశా తను ఇప్పిస్తే వడ్డీ ఎక్కువ కావాలీ? నేను అమ్మపోతే వున్న రేటుకన్న కనాకష్టంగా అమ్మాలీ? నాయం ఎక్కడుందో చూశావంటే? రామయబావకు యీ విషయాలన్నీ తెలిసి కూడా తెలియనట్టూరుకున్నాడు ఎందుకంటే, ఆపొలం తనుగా కొంటే పక్కన పెదకోటయ్య పొలంవుంది గనక, అది తనకు రొమ్ముల కుంపటవుతుందనీ, బసవయబావ కొంటే పొలంలో పొలం కలుస్తుందనీ, తెలిసే పెదాలు కదలకుండా కూచున్నాడు రామయ బావ నేనెంతమటుకు వాళ్ళ మనిషినో నీ కిప్పుడు తెలిసిందా? వాళ్ళ చుట్టూ పదిమంది చేరి వాళ్ళమీద ఆదారపట్టుంటే వారి కదొక గొప్ప! సచ్చినా నాకది గిట్టదు! పెదకోటయ్యకు పొలం అమ్మానంటే, ఎకరానికి ఆరువే లిచ్చాడు గనక అమ్మాను వీళ్ళూ, వాళ్ళు కొట్టుకు చస్తారని నేనేమన్నా కలగన్నానా? ఆ పుంఢాకోరుబుద్ధి నా కెప్పుడూ లేదు డబ్బు మదం, పార్టీ కచ్చలు వాళ్ళకు ఎప్పట్నుంచో ఉన్నాయ్ సందెప్పుడు దొరుకుతుందా అని చూస్తున్నారిన్నాళ్ళూ! ఆ జబ్బే పిల్లలకి కూడా పట్టుకుంది!' అన్నాడు అప్పయ్య

నిజం ఎవ్వాని లగండిపచ్చినా యీ రగుల్చకంతా నువే పుడకలు పెట్టావని ఆరు అందర్తో అంటున్నారు! పూరికనం నమ్మేదికూడా అదే యిన్నాళ్ళూ రామయ్యన్న కూతురు మాణిక్యాన్ని మంబ్బాయి కిస్తే ఎంత బాగుంటుందోనని కలలు కన్నా! మాణిక్యమంటే మాణిక్యమే! ఆంత అదృష్టం ఉండాలిగా' అని ఉసూరుమంది నాగరత్తమ్మ

'ఒసి పిచ్చిపక్షీ! యిదా నువనుకునేదీ! ఆమాటకొస్తే నాకుమటుకు లేదూ లోపల? అయితే రామయబావ చూపుకు మనం ఆనమని నాకెప్పుడో తెలుసు యిప్పు డసలే కత అడ్డంగా తిరిగింది' అన్నాడు అప్పయ్య

'అయినా మాణిక్యానికి మనబ్బాయంటే చాలా గుబులుంది! అబ్బాయి దెబ్బలుతిని యింట్లో పడున్నప్పుడు ఎవరికీ తెలియకుండా వచ్చి చూసిపోయింది నేను వంటింటి తలుపుసందుకుండా చూశా' అన్నది నాగరత్తమ్మ

'యిప్పటి కయింది చాలు యింకా ముదరపెట్టుకోడం దేనికి? రామయ్య బావ కీ విషయం తెలుస్తే చాలా ప్రమాదం! నువ్వు మాణిక్యంతో చెప్పు, యింకమీద యిక్కడికి రావద్దని' అన్నాడు అప్పయ్య కళ్ళు మూసుకుని చుట్ట పొగ వదులుతూ.

## 6

ఒకరోజు పైల్లోవున్న రామసుబ్బయ్య, తపాలో వచ్చిన కవరు చించి చదువుకున్నాడు

సుబ్బరామయ్య మామకు!

నాగభూషణం వందనములు,

కిందటిసారి నేను రాసిన లేఖలో మన ఊరి కొట్లాటను గురించిన వివరాలు రాశాను నాకు గాయాలు తగిలినా, వాటికి తోడు నుదుటి వశాత్తు ఆ కొట్లాటలో బలంగా దెబ్బలుపడినా— ఎవరో చనిపోయి ఉండాటి దేమైనా జరిగివుంటే పరిస్థితులు యింకా దారుణంగా మారివుండేవి కేసుల కొట్టి వేయించటానికి వూర్లో ఎవరికి ఎలా మారై పోయి ఖర్చుమటుకే అయింది; డాక్టర్ల దగ్గర చెప్పనే అవసరంలేదు! గాయాలు, విరిగిన ఎముకల్ని బాగ చేయించుకుని, అందరూ మన వూరికి చేరుకున్నారు బసవయ్య మావ యింకా తలకట్టు ఊడదీయలేదు పాపం కుడిచేతి చూపుడువేలు సహాం తీసేశారు బాపినీడుమావ నోవేం యింకా పాపుగా రాలేదు అంకమ్మ కొద్దిగా ఎడంకాలుకుంటుతున్నాడు పడమర ముఠా చినకోటయ్య తలకట్టు కూడా యింకా ఊడదీయలేదు కుడి చెవి తెగిపోయింది నిమ్మళు రాములు, సీతాయి, వీరాంబాల కుంటుతున్నారు ఏసోబ ఎడం డొక్క ఎముక విరిగినా పనికి పోలూనే వున్నాడు దీనికంతకీ మూలం పార్టీ కచ్చలే

అసలు విషయాని కొస్తాను యీ విషయంలో నువు నన్ను అపార్థం చేసుకోవని నాకు నమ్మకం వుంది

చాలాకాలంనుండి నాకు మాణిక్యం అన్నా, మాణిక్యానికి నేనన్నా చాలా యిష్టం వుంది యిప్పుడది ఒక స్థాయికి చేరుకుంది యిటీవలి కొట్లాటల వల్ల రామయ్యమావ మామీద ద్వేషం పెంచి నా మాణిక్యం మన మారలేదు మా ఇంటికి తన మనుషులు ఎవరు వెళ్ళినా కాళ్ళు విరగొట్టా నన్నాడు రామయ్యమామ రామయమావ ఇంటివేపు కన్నెత్తయినా చూడద్దొన్నాడు నాన్న

భరించలేక నేనూ మాణిక్యం తెగించాం ఎవరికీ తెలియకుండా యిద్దరం నిన్న గుంటూరు వచ్చి, మీ సత్యానికి తెలిసిన యిద్దరు పెద్దల సహకారంతో రిజిష్టరు పెళ్ళి చేసుకున్నాం రామయ్యమావ వాడి ఏకైక బాల జరిగినా జర పచ్చని ఎదురు చూస్తున్నాం!

మా తెగింపు నువు అపార్థం చేసుకోవనే గట్టి విశ్వాసంవుంది గనక, తిరుగు టపాలో నీ ఆశీస్సులు పంపమని ప్రార్థిస్తున్నాము

నాగభూషణం.